ఉచిత యోగా తరగతులను సద్వినియోగం చేసుకోండి

రాజేంద్రనగర్: టీచర్స్ కాలనీ కట్ట మైసమ్మ దేవాలయం వద్ద ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా తరగతులను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ తరగతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 6.30గంటల నుంచి 8.30 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని అన్నారు.

మర్యాదపూర్వక కలయిక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు వర్రీ లలిత్ తులసిరామ్‌ను మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పోయిల జీవన్‌దాస్, ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, కోశాధికారి మంగలారం శ్రీనివాస్, పంబాల రాజు, గొడుగు సంజీవ, ఎడ్లకాడి చంద్రశేఖర్, బర్ల సుమన్, కవ్వగూడెం గౌతమ్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకుంటున్న ఆర్ట్ ఎగ్జిబిషన్

విజయనగర్‌కాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తుంది. సిరి ఆరిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరి శక్తి పేరిట మహిళలు వేసిన చిత్రాలతో ఈ మెగా పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా పలువురు చిత్రకారులు మాట్లాడుతూ..మహిళల గొప్పతనాన్ని తెలియజేసేలా ప్రదర్శన నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు మురళీధర్, బాలభక్త, మెజిషియన్ సత్యాంబ, నిర్వాహకులు చొక్కాపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

అబిడ్స్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. ఓల్డ్ ఫీల్‌ఖానాలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని ఈ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఖర్జూరాలు తినిపించారు.

రంజాన్‌లో నిరుపేదలను ఆదుకోవాలి

గోల్కొండ: రంజాన్ మాసంలో నిరుపేదలను ఆదుకోవాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. జీఎంకే గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ షకీల్ అలీఖాన్ రంజాన్ మాసంలో చేస్తున్న సేవలను పురస్కరించుకొని మంగళవారం ఆయనను గోల్కొండ బంజారి దర్వాజ వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెండు దశాబ్దాలకు పైగా కేవలం రంజాన్ మాసంలోనే కాకుండా జీఎంకే గ్రూప్ వారు నిరుపేదలను ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

గన్‌ఫౌండ్రీ: అవని వాత్సల్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవని ఫౌండేషన్ సభ్యులు అర్చన, రవిశర్మ మాట్లాడుతూ..మహిళగా ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు పలు స్వయం ఉపాధి పథకాలను అదిస్తున్నట్లు తెలిపారు. ఇంటి వద్దనే ఉంటూ క్యాండిల్స్, సబ్బులు, బిస్కెట్లు వంటి ప్యాకింగ్ ఉత్పత్తులు చేసి ఆర్థికంగా అభివృద్ధిని సాధించేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళామణులను ఘనంగా సత్కరించారు.

ద్విచక్ర వాహనాల రాకపోకలను అనుమతించాలి

అబిడ్స్: గోషామహల్ ప్రధాన రహదారిలో నాలా కూలిపోవడంతో వాహనాల దారి మళ్లించగా ట్రాఫిక్ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. స్థానిక నాయకులు ఆలపురుషోత్తం రావు, సురేష్ ముదిరాజ్ విజ్ఞప్తి మేరకు గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ, జీహెచ్‌ఎంసీ ఏఈ మహేందర్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోషామహల్ ప్రధాన రహదారి మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో వ్యాపారాలు నడవక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాపారులు వాపోతున్నారన్నారు. వెంటనే ద్విచక్ర వాహనాల రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలని వారు ఏసీపీ ధనలక్ష్మికి విజ్ఞప్తి చేయగా ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ట్రాఫిక్ ఏసీపీ ఏఈ మహేందర్‌తో మాట్లాడి నాలా పైకప్పు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని కోరినట్లు పురుషోత్తంరావు అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


నార్సింగి ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల పెంపు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ పీఎం శ్రీ నిధులు రూ.81లక్షలు, ఏడబ్ల్యూపీ నిధులు రూ.1.43 కోట్లు, మొత్తం రూ.2.24 కోట్ల నిధులతో నిర్మించిన 14 అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర శివారులో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరిగిపోతుందన్నారు. అందుకు అనుగుణంగా అదనపు తరగతి గదులు, మూత్రశాలలు, మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా అనేక పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పలు ఐటీ, సేవా సంస్థలు ముందుకొచ్చి వాటి రూపురేఖలు మార్చుతున్నారని అన్నారు.

పేద విద్యార్థులకు అండగా నిలబడాలి..

◆ పేద విద్యార్థులను అన్ని రకాలుగా ఆదుకుని వారికి అండగా నిలబడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. నార్సింగితో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు కొనసాగుతున్నాయని అన్నారు. అవన్నీ పూర్తయితే రాబోయే విద్యా సంవత్సరం నుంచి మరింత సౌకర్యంగా విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. గండిపేట మండలానికి జూనియర్ కళాశాల మంజూరు విషయం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె. వేణుగౌడ్, పీఏసీఎస్ చైర్మెన్ కృష్ణ, మండల విద్యాధికారి కె.విజయ్ కుమార్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

అత్తాపూర్: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తమవంతు బాధ్యతగా పనులను చేయిస్తున్నామని సులేమాన్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్ అన్నారు. ఎంఎంపహాడీ ప్రాంతంలో వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి నూతన లైట్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో అధికారులతో చర్చించి వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయడంతో పాటు కొత్త లైట్లను ఏర్పాటు చేయించామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.



గట్టు రాంచందర్‌రావుకు ఎమ్మెల్సీ కవిత పరామర్శ


గట్టు రాంచందర్‌రావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

మణికొండ: బీఆర్ఎస్ అధికార ప్రతినిధి గట్టు రాంచందర్‌రావును మంగళవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకుని అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఆయన నివాసానికి వచ్చారు. గట్టు రాంచందర్ రావుతో పాటు ఆయన ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. త్వరలోనే కోలుకుని ఎప్పటిలాగే పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులతో చర్చించారు. కాలనీల వారీగా ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు 'గుడ్ మార్నింగ్ మణికొండ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పార్టీ అధ్యక్షుడు డి. సీతారాం తెలిపారు. భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా గెలుపు బీఆర్ఎస్‌దేననే ధీమాతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు పి.రూపారెడ్డి, ఉపాధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు స్వాగతం

శంషాబాద్: నెలరోజు కిందట ఉమ్రా యాత్రకు బయల్దేరిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 50మంది యాత్రికులు మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. యాత్రను అల్ మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షించారు.



క్రమశిక్షణకు మారుపేరు..

సరస్వతి శిశుమందిరాలు



శంషాబాద్: సరస్వతి శిశుమందిర్ పాఠశాలలు క్రమశిక్షణకు మారుపేరులాంటివని మాజీ డీజీపీ గోపినాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల వార్షికోత్సవాన్ని మినీ స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు ముందుకెళ్లాలన్నారు. తల్లిదండ్రులతో పాటు మన ఊరు.. దేశానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు మురళీధర్‌గుప్తా, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ హనుమంతురావు, జమల్‌పూర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది ఎస్కీలో 400 శిక్షణా కార్యక్రమాలు

- 7వేల మంది అధికారులకు శిక్షణ
- 2025–26 వార్షిక శిక్షణా కార్యక్రమాల కేలండర్ ఆవిష్కరణ
- డైరెక్టర్ డాక్టర్.రామేశ్వరరావు వెల్లడి

రాయదుర్గం: ప్రపంచంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించినట్లు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. మంగళవారం గచ్చిబౌలిలోని 'ఎస్కీ' ఆధ్వర్యంలో 2025–26 వార్షిక శిక్షణా కార్యక్రమాల కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం 400 శిక్షణా కార్యక్రమాల ద్వారా 7వేల మంది అధికారులకు శిక్షణ ఇవ్వాలని తలపెట్టినట్లు ఆయన వివరించారు. ఇంజనీరింగ్ ప్రొఫెషనల్స్‌కు ఎప్పటికప్పుడు నైపుణ్యాలు అవసరమవుతాయని సెమినార్లు, వర్క్‌షాపులు, విద్యాపరమైన పర్యటనలు, సదస్సులు, ఈ లెర్నింగ్ తదితరాల ద్వారా నేర్చుకుంటారన్నారు. జియో స్పేషియల్ సొల్యూషన్స్, స్మార్ట్ సిటీస్, గ్రీన్ బిల్డింగ్స్ ఆవశ్యకత, కొన్ని ప్రాంతాల్లో నిర్మించే కట్టడాలపై సవాళ్ళు, 3 డీ ప్రింటింగ్ ఆవశ్యకత, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, 5 జీ, గ్రీన్ హైడ్రోజన్, డ్రోన్ టెక్నాలజీ తదితర అంశాలలో సుమారు 400 శిక్షణా కార్యక్రమాలను ఏప్రిల్–2025 నుంచి మార్చి–2026 వరకు 'ఎస్కీ' ప్రాంగణంలో నిర్వహిస్తామని వివరించారు. అనంతరం ఎస్కీ అధికారులు, ఉద్యోగులతో ఎస్కీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్కీ వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ కృష్ణప్రసాద్‌రావు, వెంకట్‌రెడ్డి, చంద్రకళ, పి శ్రీధర్,సాగర్, రాజారావు, సయ్యద్ అజ్గర్, భరత్, శ్రీధర్‌బాబు, లక్ష్మీకాంతారావు, అమర్‌నాథ్, అనితాఅగర్వాల్, సాయికిషోర్, నరేష్, తిలక్ పాల్గొన్నారు.


'ఎస్కీ'లో వార్షిక శిక్షణా కార్యక్రమాల కేలండర్‌ను ఆవిష్కరించిన డైరెక్టర్ రామేశ్వరరావు

ఆరె కటికల అభ్యున్నతికి కృషి

గన్‌ఫౌండ్రీ: ఆరె కటిక కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో 16వ ఆరె కటిక మహాసభ నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా, ఆరు గ్యారంటీల అమలు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కులగణన నిర్వహించి బీసీల జనాభాను అధికారికంగా ప్రకటించామని గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. బీసీల జనాభా అధికారికంగా తెల్పడం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాదు భవిష్యత్తులో కూడా బీసీలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు నాడు బీసీలు గుర్తురాలేదని, ఇప్పుడేమో బీసీలపై కపట ప్రేమను కనబరుస్తున్నారని మండిపడ్డారు. ఆరె కటిక కులస్తుల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, కార్పొరేషన్ల చైర్మన్‌లు ఇ.అనిల్, ఫయీం, శివసేనారెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లతో సత్వర పరిష్కారం

ఫిలింనగర్: మీడియేషన్ సెంటర్ల ద్వారా సత్వర పరిష్కారం, న్యాయంతో పాటు కోర్టులపై కూడా భారం తగ్గుతుందని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరి, జిల్లా సెషన్స్ జడ్జి సీహెచ్. పంచాక్షరి అన్నారు. ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మీడియేషన్ సెంటర్లపై శిక్షణ పొందిన ప్రతినిధులతో కలిసి మంగళవారం బస్తీవాసులకు ఈ సెంటర్ ఆవశ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 మీడియేషన్ చట్టం ప్రకారం ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేసిన సెంటర్లలో మంచి ఫలితాలు రావడంతో ఇప్పుడు అన్ని చోట్లా ఏర్పాటు చేసేందుకు న్యాయ వ్యవస్థ ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ మీడియేషన్ సెంటర్‌లో శిక్షణ పొందిన మధ్యవర్తుల ద్వారా చిన్న చిన్న కుటుంబ తగాదాలతో పాటు గొడవలు వంటి వాటికి సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు. ఈ సెంటర్ల వల్ల కోర్టులు, పోలీస్ స్టేషన్లపై భారం తగ్గుతుందని అన్నారు. తక్కువ సమయంలోనే మెరుగైన ఫలితాలను వీటి వల్ల పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, స్టేట్ లీగల్ అథారిటీ సర్వీసెస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.కళార్చన, ఫిలింనగర్ ఎస్ఐ గణేష్, మీడియేషన్ కమిటీ సభ్యులు బొజ్జ పీటర్, జిల్ల సుగుణమ్మ, ఎస్. దాసు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల విలీనంపై సుప్రీంకోర్టులో పిటిషన్

శంషాబాద్ రూరల్: మున్సిపాలిటిలో పంచాయతీల విలీనంపై రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు చిన్న గోల్కొండ మాజీ సర్పంచ్ గుర్రం పద్మావతి అనంత రెడ్డి తెలిపారు. మంగళవారం ఇక్కడ మాట్లాడుతూ.. మండలంలోని పంచాయతీలను ఇష్టానుసారంగా మున్సిపాలిటీలో విలీనం చేసి ఇక్కడి సామాన్యులపై ఆర్థికభారం మోపడం సరికాదన్నారు. జీఓ 111 కారణంగా ఈ ప్రాంతం చాలా వెనకబడిందని.. జీఓ తొలగింపుపై నిర్ణయం తీసుకోకుండా పంచాయతీలను విలీనం చేయడం తగదన్నారు. మున్సిపాలిటిలో విలీనం చేసిన వెంటనే ఆయా గ్రామాల్లో ఇంటి పన్ను, నల్లా పన్నులను పెంచడమే కాకుండా ముక్కుపిండి వసూలు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టడం పేదవారికి శాపమన్నారు. రాజకీయంగా ఈ ప్రాంతం నాయకులను ఎదుర్కోలేక ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కోర్టు ద్వారా న్యాయం కోసం పోరాడుతామని తెలిపారు.

రేపు హెచ్‌సీయూలో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ విశిష్ట ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు హెచ్‌సీయూ క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో ఈ ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూ వీసీ ప్రొ. బీజేరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో ముఖ్యవక్తగా డెన్మార్క్‌లోని ఆర్హస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సురేష్ పాల్గొని 'ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపడం ఎలా .. అనే అంశంపై ప్రసంగిస్తారు. ఈ సమావేశం స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ యానిమల్ బయాలజీ ప్రొ.అనిత జగోటా పర్యవేక్షణలో సాగుతుంది.

ఎల్‌ఆర్‌ఎస్‌లో 25 శాతం రాయితీ

- ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి
- ఎల్‌ఆర్‌ఎస్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం


చందానగర్ సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించే విధంగా కృషి చేయాలని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 1500 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు 25 శాతం రాయితీని పొందవచ్చని, ఫోన్ ద్వారా సమాచారం అందించి ఫీజులు చెల్లించే విధంగా చూడాలన్నారు. త్వరితగతిన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనధికార ప్లాట్లు, లేఔట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరోసారి కల్పించిన లే అవుట్ రెగ్యులైజేషన్ (ఎల్‌ఆర్‌ఎస్) పథకాన్ని ప్రకటించిందని, దీనిపై 25 శాతం రాయితీ ఇస్తున్నామని సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీపీఎస్ అధికారులు, జూనియర్ అసిస్టెంట్‌లు, న్యాక్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం


కాలనీలో పర్యటించిన కార్పొరేటర్, అధికారులు

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టీఎన్‌జీఓ కాలనీలో ఆయన స్థానికులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలని నీటి సరఫరాను మెరుగుపర్చాలని, వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడాలని, పారిశుద్ధ్యంపై కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. పార్కు స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు, క్రీడాప్రాంగణం, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్‌రెడ్డి, డీఈ విశాలాక్షి, ఇతర అధికారులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో తీరిన నీటి సమస్య

నానక్‌రాంగూడ స్కూలుకు తాగునీటి ట్యాంకర్ పంపిన జలమండలి

రాయదుర్గం: నానక్‌రాంగూడ ప్రభుత్వ పాఠశాలలో నీటి సమస్య తీరింది. జలమండలి గచ్చిబౌలి సెక్షన్ డీజీఎం నరేందర్‌రెడ్డి మంగళవారం మంచినీటి ట్యాంకర్‌ను పంపారు. రెండు రోజుల క్రితం కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకుడు సంజీవరెడ్డి కలిసి పాఠశాలలో నీటి సమస్యపై డీజీఎంకు వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో బోరు పని చేయడం లేదని ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని కుళాయి కనెక్షన్‌కూడా ఇవ్వాలని వారు కోరారు. ఈ విషయమై డీజీఎం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో నీటి సమస్య పరిష్కారానికి ట్యాంకర్ పంపామని, అక్కడ సంపు చిన్నదిగా ఉందని వారం రోజులపాటు వాడుకోవచ్చన్నారు. నీటి సమస్య ఉందని సమాచారం అందిస్తే వెంటనే ఏర్పాటు చేస్తామని చెప్పారు.


పాఠశాలలోని సంపులో నీరు నింపుతున్న దృశ్యం

కార్పొరేషన్ అభివృద్ధిపై సమీక్ష

వివిధ శాఖల అధికారులతో మాట్లాడిన ప్రత్యేక అధికారి శ్రీధర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి పి.శ్రీధర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీటి వనరులు, వార్డుల వారీగా కార్యాచరణ ప్రణాళిక, వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, ఎల్‌ఆర్‌ఎస్ సర్వే, అడ్వర్‌టైజ్మెంట్ పన్నుల వసూలు, ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్స్, ఆన్–అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ పన్ను విధింపు, ఇంజనీరింగ్ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల పురోగతి, నూతన అభివృద్ధి పనులపై చర్చించారు.

◆ వన మహోత్సవంలో మొక్కల పెంపకం, నాటిన మొక్కల సంరక్షణ, నర్సరీ నిర్వహణ, రాబోయే సంవత్సరంలో టార్గెట్స్ ప్రకారం నర్సరీల పెంపుపై సంబంధిత అధికారులతో మాట్లాడారు.

◆ వార్డులలో వీధి దీపాల నిర్వహణ, నూతన లైట్లు ఏర్పాటు, మరమ్మతులు, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు విడుదల, అక్రమ నిర్మాణాలపై చర్యలు, కోర్టు కేసులపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

◆ నూతన బడ్జెట్ ప్రతిపాదనలు, బ్యాలెన్స్, చెల్లింపుల అభ్యంతరాలు, బ్యాంకు లింకేజీ, ఇందిరా మహిళా శక్తి స్కీమ్, వివిధ టార్గెట్స్, నూతన సంఘాల ఏర్పాటు, స్వచ్ఛ సర్వేక్షణ్–2025, సిటిజన్ ఫీడ్ బ్యాక్‌పై ఆరా తీశారు. ఈ సమావేశంలో కమిషనర్ శరత్‌చంద్ర, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌అండ్‌ఎస్‌బీ డీజీఎం మహేశ్వరి, మున్సిపల్ మేనేజర్ మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, జలమండలి మేనేజర్ టి.శ్రీనివాస్, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ల అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, డీఈవోలు, ఆర్పీలు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి పి.శ్రీధర్


సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9989616273
9010221230